www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 11 అక్టోబర్ 2024

5

చిత్తూరు

జిల్లా సైనిక సంక్షేమ అధికారిగా రాఘవులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా సైనిక సంక్షేమ అధికారిగా కెవి రాఘవులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పశుసంవర్ధక శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన కెవి.రాఘవులు ఉద్యోగోన్నతిపై పశు సంవర్ధక శాఖ ఏడిగా కడప జిల్లాకు బదిలీ అయ్యారు. కడప జిల్లా నుండి డిప్యూటేషన్ పై జిల్లా సైనిక సంక్షేమ అధికారిగా నియమితులయ్యారు. మాజీ సైనికుల కోసం తన వంతు కృషి చేయడంతో పాటు సైన్యంలో చేరేందుకు ఆసక్తి చూపే యువతను ఉత్సాహాన్ని అందించబడినట్లు తెలిపారు. ఈయన ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షులు కూడా కావడంతో కడప జిల్లా నుండి చిత్తూరు జిల్లాకు రావడం పట్ల ఏపీ ఎన్జీవో నాయకులు ఉద్యోగులు రాఘవులుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

అసంపూర్తిగా బడుల పనులు..

- అవస్థల్లో విద్యార్థులు..

గత ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధిలో భాగంగా. .నాడు- నేడు పథకం కింద రెండు దశల్లో పలు పాఠశాలలను ఎంపిక చేసి పెద్దఎత్తున నిధులు మంజూరు చేయడం జరిగింది. ప్రస్తుతం పాఠశాలల నిర్మాణం పనులకు కావలసిన నిధులు ఆగిపోవడంతో భవన నిర్మాణం పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. అసంపూర్తిగా ఉన్న భవనాలతో విద్యార్థులకు తరగతి గదులు లేకుండా తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

పి కొత్తకోటలో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణం పనులు

ప్రజాశక్తి- పూతలపట్టు

మండలంలో మొత్తం 75 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో మొదటి దశలో 18 ప్రభుత్వ పాఠశాలలను నాడు- నేడు కింద మంజూరు చేయడం జరిగింది. ప్రస్తుతం ఈ పాఠశాలల నిర్మాణం పనులు పూర్తయ్యాయి. రెండవ విడతలో అంగన్వాడీ కేంద్రాలతో కలిపి మొత్తం 16 పాఠశాలలు నాడు- నేడు కింద ఎంపిక చేశారు. ఇందులో ఐదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలు ఉన్నాయి. ఈ పాఠశాలల అభివృద్ధి కోసం సుమారు రూ.4కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులు మంజూరు కాకపోవడంతో ప్రస్తుతం భవన నిర్మాణం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అదనపు గదులు పూర్తికాక తరగతి గదులు స్థలాలు చాలక ఇరుకుగా విద్యార్థులు చదువులు కొనసాగించాల్సి వస్తోంది. ఈ దసరా సెలవుల్లోనైనా పనులు పూర్తి చేయాలని ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

పోలవరం ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు

ఇక్కడ చెప్పలేని కష్టాలు..

మండలంలోని బండపల్లి, ముత్తురేవుల, తలుపులపల్లి, కొత్తకోట, పోలవరం ఐదు ఉన్నత పాఠశాలలకు సుమారు నాలుగు కోట్లు నిధులతో పనులు ప్రారంభించారు. ముత్తిరేవుల, కొత్తకోట, తలుపులపల్లి ఉన్నత పాఠశాలల్లో సరైన తరగతుల లేక విద్యార్థులు ఆరు బయట విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మరికొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, వంట గదులు, విద్యుత్ సౌకర్యం లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

పనులు పూర్తి చేస్తాం..

నూతన ప్రభుత్వం చేపట్టనున్న విధివిధానాలపై ఎదురు చూస్తున్నాం. ఇందుకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాం. పై అధికారులు కూడా సానుకూలంగా స్పందిస్తున్నారు. నిధులు మంజూరు కాగానే పనులు వేగవంతానికి చర్యలు తీసుకుంటాం.

- సుదర్శన్, ఎంఈఓ, పూతలపట్టు

చెత్త భారం నుంచి ఊరట

నగర వీధుల్లో చెత్తను తరలిస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు తీవ్రస్థాయిలో వ్యతిరేకించినప్పటికీ గత ప్రభుత్వం సామాన్య, మధ్యతరగతి ప్రజలపై చెత్తభారం మోపింది. చెత్తపన్ను వసూలు చేసింది. చిరకు మురికివాడల్లో నివశించే కూలీల కుటుంబాలపై సైతం నెలకు రూ.75ల పన్నులు వేసింది. ఇంటింటా చెత్తసేకరణ, తడిపొడి చెత్తలు వేరుచేసి సంపద సృష్టి అంటూ ప్రజల నుంచి ప్రతి నెలా చెత్త పన్నులు వేసింది. ఇదిలా ఉండగా సంపద తయారీ కేంద్రాలు, సేంద్రియ ఎరువుల తయారీ వంటి ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరకపోగా కంపోస్టు యార్డుల వద్ద గుట్టలు గుట్టలుగా పేరుకుపోయింది చెత్త. మరోవైపు చెత్త తరలింపు థార్డ్‌పార్టీ ఏజెన్సీకి అప్పగించినా డీజిల్ ఖర్చులు, కార్మికుల జీతాల చెల్లింపు నిధులు దారి మళ్లించడంతో క్లాప్‌మిత్రలు జీతాల కోసం రోడ్డు ఎకాల్సి వచ్చింది. వేతనాల కోసం క్లాప్‌మిత్ర వాహన డ్రైవర్లు రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజుల పాటు సమ్మెకు పూనుకోవడంతో పాటు పెండింగ్ వేతనాల కోసం కార్మికులు పోరాటాలు సాగిస్తున్నారు.

ఏజెన్సీకి జమకాని నిధులు..

నగరపాలిక, పురపాలికల్లో చెత్త తరలింపు కోసం ఏర్పాటు చేసిన క్లాప్‌మిత్ర చెత్త ఆటోల తరలింపు కార్మికులకు చెల్లించాల్సిన నిధులు సదరు ఏజెన్సీకి చెల్లించకుండా దాదాపు రూ.50లక్షలకు పైగా దారి మళ్లించడంతో కార్మికుల జీతాలు అందక ఇబ్బదులు ఎదుర్కొవాల్సి వచ్చింది. ఇంటింటా చెత్తపన్ను వసూళ్లలో చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో కొందరు వాలంటీర్లు చేతివాటం ప్రదర్శించి సస్పెండ్ అయ్యారు. చిత్తూరు నగర పాలక సంస్థలో పేదల ఇళ్ళ నుంచి రూ. 60, మధ్యతరగతి రూ.90, వాణిజ్య సముదాయాలు, క్లీనిక్‌లు, కళ్యాణ మండపాలు, లాడ్జీలు రూ. 150 నుంచి రూ.250 నగర పాలక సంస్థ చెత్తపన్ను రూపంలో నెలనెలా వసూలు చేసింది. ఇలా చిత్తూరు నగరంలో ప్రతి నెలా లక్షన్న నుండీ రెండు లక్షల వరకు చెత్త పన్నులు వసూలు చేశారు.

చెత్త పన్ను రద్దుతో ఊరట..

2021 అక్టోబర్ నెలలో నాటి రాష్ట్ర ప్రభుత్వం క్లిన్ అంధ్రప్రదేశ్ పేరిట రాష్ట్రంలో 40 నగరాలు, పట్టణ ప్రాంతాల్లో చెత్తసేకరణపై పన్ను విధించింది. ఇందు కోసం చెత్త సేకరణ ఆటోలు ఏర్పాటు చేసింది. అందులో భాగంగా చిత్తూరు నగరపాలక సంస్థకు 27 చెత్తసేకరణ ఆటోలను కేటాయించింది. ఇలా కేటాయించిన ఆటోలకు నెలకు రూ.63వేల చొప్పున ప్రజల నుండీ పన్నుల రూపంలో వసూలు చేసిన డబ్బుల నుండీ చెల్లించాలి. ప్రతినెలా చెత్తపన్ను పేరుతో పేద, మధ్యతరగతి అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చింది. ఎన్నికల్లో హామీ మేరకు కూటమి ప్రభుత్వం చెత్తపన్ను రద్దు చేయడంతో నగర ప్రజలకు చెత్తపన్ను ఊరట కలిగింది. చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో 79 వేల గృహాలకు చెత్తపన్ను భారం నుండీ ఊరట లభించింది.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలే లక్ష్యం

ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్రంలో యువత, మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగంలో విస్తృతంగా ఉద్యోగ, ఉపాధ్యాయ అవకాశాలు కల్పించడంతో పాటు గ్రామస్థాయిలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా పనిచేస్తుందన్నారు. ఇందులో భాగంగానే టాటా కన్సల్టెన్సీ సర్వీస్ విశాఖపట్నంలో డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిందన్నారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ చేసిన కృషి ఫలితంగా టాటా సంస్థ విశాఖలో తమ డెవలప్మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం శుభపరిణామం అన్నారు. ఇదే సమయంలో క్షేత్రస్థాయిలో గ్రామాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా ఈనెల 14వ తేదీ నుంచి పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేపడుతున్నట్లు చెప్పారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని చిత్తూరు రూరల్, గుడిపాల మండలాలలో ఇప్పటికే గ్రామసభలను విజయవంతంగా పూర్తి చేశామని, సుమారు రూ.9.34 కోట్ల మేర విలువైన 153 అభివృద్ధి పనులకు ఆమోదం పొందామన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో ఈ పనులను ప్రారంభోత్సవం చేయన్నుట్లు చెప్పారు.

సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే

- డ్రైవర్స్ కాలనీలో ఆక్రమణలు
- ఇరువర్గాల మధ్య ఘర్షణలు
- విచారించి నివేదికలు ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు

ప్రజాశక్తి- గంగవరం:

మండలం డ్రైవర్స్ కాలనీలో ఆక్రమణల పేరిట ఇరువర్గాల మధ్య జరుగుతున్న గొడవలపై పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి స్పందించారు. గురువారం ఎమ్మెల్యే స్థానిక నేతలతో కలిసి కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా వాస్తవ పరిస్థితులను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో కొంతమంది ఇష్టానుసారం ఆక్రమణలకు పాల్పడి ప్రస్తుతం అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని పలువురు తెలియజేశారు. పేదలైన తమకు పట్టాలు ఉన్నప్పటికీ కొందరు దౌర్జన్యంగా పునాదులను పెకిలించేశారని మొర పెట్టుకున్నారు. దీంతో ఎమ్మెల్యే మండల తహశీల్దారు శివకుమార్‌ను అక్కడికి పిలిపించి కాలనీలో జరిగిన ఆక్రమణలపై పూర్తి విచారణ చేపట్టి వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం అర్హులైన పేదలందరినీ గుర్తించి పట్టాలతో పాటు ఇళ్ళను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని, ఎవరు అధైర్య పడాల్సిన అవసరం లేదని, నిజమైన పేదలకు తప్పక న్యాయం చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఆక్రమణలకు పాల్పడిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

14న కుప్పంలో నారా భువనేశ్వరి పర్యటన

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గ పరిధిలో ఈనెల 14వ తేదీ సోమవారం నుండి నాలుగు రోజుల పాటు పర్యటించనున్నట్టు తెలిపారు. 14వ తేదీ మొదటి రోజు హైదరాబాదు నుండి బెంగళూరు విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుండి రోడ్డు మార్గంలో వీకోట మీదగా శాంతిపురం మండలంలో పర్యటిస్తూ కుప్పం చేరుకుంటారు. ఈ పర్యటనలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలలో పర్యటిస్తూ మహిళలతో, కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులతో సమావేశమవుతారు. అదేవిధంగా ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున కుప్పంలో డీఎస్సీ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయునున్నట్లు తెలిపారు.

నారా భునేశ్వరి పర్యటన జయప్రదం చేద్దాం

రామకుప్పం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ నారా భువనేశ్వరి ఈనెల 14వ తేదీన కుప్పం నియోజకవర్గం పర్యటనకు విచ్చేస్తారని టీడిపి నేతలు పేర్కొన్నారు. నాలుగు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా రెండవ రోజైన 15వ తేదీ మంగళవారం రామకుప్పం మండల పరిధిలోని మొద్దులవంక, గాంధీనగర్ గ్రామాల్లో పర్యటించి మహిళలతో ముఖాముఖి సమావేశమవుతారని అన్నారు. ఆమె పర్యటనను విజయవంతం చేసేందుకు టీడిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని టీడిపి నేతలు ఆనంద రెడ్డి, మునస్వామీ, పత్ర నారాయణ, నరసింహులు, చిన్ని కృష్ణ, సుబ్రీ, చంద్ర రెడ్డి, సత్యనారాయణ కోరారు.

దళితులపై దాడి..

- వారిపైనే హత్యాయత్నం కేసులు
- పాలకుల ఒత్తిడితో దళితులకు అన్యాయం
- ఆందోళనకు సిద్ధమవుతున్న దళిత సంఘాలు

ప్రజాశక్తి- వి కోట: అణగారిన దళిత వర్గాలపై అగ్రవర్ణాల దౌర్జన్యకాండ మితిమీరి దళితులను చితకబాది వారిపైనే హత్యాయత్నం కేసు నమోదు చేసిన సంఘటన వీకోట మండలంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మిట్టూరు గ్రామానికి చెందిన దళితుడైన గోపాలప్ప కుటుంబానికి, అదే గ్రామం అగ్రకులాలకు చెందిన వెంకట్రాముడు కుటుంబానికి గొడవల కారణంగా వీకోట పోలీస్ స్టేషన్లో కేసు నడుస్తోంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం గోపాలప్ప కుమారుడు వెంకటేష్ తన ఇంటి ముందు పళ్ళు తోముకుంటూ ఉమ్మి వేయడంతో అదే సమయానికి ఇంటి ముందు అదే గ్రామానికి చెందిన టిడిపి నేత వెంకట్రాముడు వెళ్తూ నన్ను చూసి నాపై ఉమ్మి వేస్తావా అంటూ ఆగ్రహంతో దళితుల ఇంటి ప్రాంగణంలోకి చొరబడి దాడికి పాల్పడ్డాడు. దీనికి తోడు వెంకట్రాముడు కుటుంబీకులు విషయం తెలుసుకుని గోపాలప్ప ఇంటి వద్ద చేరుకొన్నారు. దళిత కుటుంబంపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో గోపాలప్పకు అతని కుమారుడు వెంకటేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. పెనుగులాటలో రామప్ప వర్గీయులకు స్వల్పంగా గాయాలైనట్లు తెలుస్తోంది. గాయపడ్డ దళితులు కుటుంబీకులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స నిమిత్తం వారిని కుప్పం మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెయ్యి విరిగి.. తల పగిలిన దళితులు ఇచ్చిన ఫిర్యాదుపై నామమాత్రపు కేసు నమోదు చేసిన పోలీసులు, అధికారపార్టీ నేతల ఒత్తిడితో అగ్రవర్ణాల ఫిర్యాదు మేరకు దళితులపైనే హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఓ కేసు నడుస్తోంది.. పలుమార్లు కక్షగట్టి దళిత కుటుంబంపై నిందితుడు, వారి అనుచరులు దాడి చేయడాన్ని వివిధ సంఘాల ప్రతినిధులు తీవ్రంగా ఖండిస్తున్నారు.

దాడిలో గాయపడిన దళితులు వెంకటేష్, విరిగిన గోపాలప్ప చేయి

ఆందోళనకు సిద్ధమవుతున్న దళిత సంఘాలు

మిట్టూరు గ్రామంలో దళిత కుటుంబంపై అగ్రవర్ణాలు దాడికి పాల్పడ్డాన్ని మండలంలోని వివిధ దళిత సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. ఇదివరకే ఓ కేసు నడుస్తుండగా కేసు నుండి బయట పడేందుకు పలుమార్లు అధికారపార్టీ నేతలు అధికారం అండ ఉందన్న ధైర్యంతో ఘర్షణలకు దిగడాన్ని దళిత సంఘాలు తీవ్రంగా తప్పు పడుతున్నాయి. దళిత కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు తమ పోరాటం కొనసాగిస్తామని వారు తెలిపారు.

గంటా మోహన్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఉపాధ్యాయ సమస్యలపై ప్రశ్నించారనే అక్కసుతో క్రమశిక్షణ చర్యలు తీసుకున్న గంటా మోహన్‌పై సస్పెన్షన్ బేషరతుగా ఎత్తివేయాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం చిత్తూరులోని ఎన్జీవో హోంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ గంటా మోహన్ జిల్లాలో ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక సంఘాల పక్షాన సీనియర్ నాయకుడిగా ఎన్నో సమస్యల పరిష్కారానికి కృషి చేశారని, ఆయన పట్ల కక్షపూరిత వైఖరిని విడనాడాలని స్పష్టం చేశారు. డిఇఓ సానుకూలంగా స్పందించకపోతే నిరసనగా శుక్రవారం ఉదయం చిత్తూరులో మెరుపు ఆందోళన నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం అన్ని సంఘాల నాయకులు డిఇఓ కార్యాలయానికి నోటీసు అందజేయడానికి వెళ్లగా డిఇఓ దేవరాజు మాట్లాడుతూ మంచి నాయకునిగా గంటా మోహన్ పట్ల తనకు గౌరవం వుందని వెంటనే సస్పెన్షన్ ఎత్తివేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. దీంతో శుక్రవారం ఆందోళనను సంఘాలు తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు మునాఫ్, జివి.రమణ, చెంగ్రాయ మందడి, మదన్ మోహన్ రెడ్డి, గోపినాథ్, మునీర్ అహ్మద్, మణి గండన్, మధు, మోహన్ యాదవ్, కిరణ్ కుమార్, జగన్మోహన్ రెడ్డి, హేమచంద్ర రెడ్డి, శేఖర్, యువరాజ్, ఇలియాస్, రామచంద్ర, జనార్ధన్‌రెడ్డి, లోకనాథరెడ్డి పాల్గొన్నారు.

డీఈఓతో చర్చిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

మద్యం షాపుల గడువు పొడిగింపు

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాల దరఖాస్తు చేసుకొనుటకు గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించిందని ఎస్ఈబి సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.సురేష్ రెడ్డి గురువారం ఓప్రకటనలో తెలిపారు. పుంగునూరు ఎస్ఇబి పరిధిలో మున్సిపాలిటీ, చౌడేపల్లి, సోమల, పెద్దపంజాణి మండలాలు వారిగా నోట్ చేసిన ప్రైవేట్ మద్యం షాపులు ఏర్పాటు కొరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు 11వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఇప్పటివరకు గుర్తించిన 14 షాపులకు గాను 103 దరఖాస్తులు వచ్చాయన్నారు. మద్యం షాపులు ఏర్పాటుకు ఆసక్తి గలవారు ఎవరైనా ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో లేదా ఆన్‌లైన్‌లో కానీ రెండు లక్షల నాన్ రిఫండ్ బుల్ రుసుం చెల్లించి 11వ తేదీ శుక్రవారం సాయంత్రం 7గంటల లోపు దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. షాపులు ఏర్పాటుకు సంబంధించి 14వ తేదీ ఉదయం చిత్తూరు పట్టణంలోని చిత్తూరు కాణిపాకం రోడ్డు సంతపేట వద్దగల ఆర్ఆర్ గార్డెన్స్ లో లాటరీ తీయబడునని తెలిపారు.

కుప్పం టౌన్: కుప్పం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పది మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం మరో రెండు రోజుల గడువు ఇచ్చినట్టు ఎక్సైజ్ సీఐ నాగరాజా ప్రకటన ద్వారా తెలిపారు. కుప్పం పట్టణం, గుడుపల్లి, శాంతిపురం, రామకుప్పం మండలాలకు కలిపి పది మద్యం షాపులకు అనుమతి ఉందన్నారు. వాటికి దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 11వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు గడువు ఇస్తున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు ఎక్సైజ్ శాఖ కుప్పం సిఐ, ఎస్ఐలను సంప్రదించవచ్చన్నారు.

అదుపుతప్పితే.. ఆసుపత్రికే..!

ప్రజాశక్తి- పూతలపట్టు

మండల కేంద్రంలోని బజారువీధిలో బావులను తలపించే విధంగా రోడ్డుపై గుంతలు దర్శనమిస్తున్నాయి. నిత్యం వాహనాల రాకపోకల రద్దీగా ఉన్న ఈ మార్గంలో అధికంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. ముఖ్యంగా వాసవీపరమేశ్వరి ఆలయం ముందు అత్యంత ప్రమాదకరంగా గుంతలు ఉన్నాయి. వాహన చోదకులు ఏమాత్రం అదుపుతప్పిన ఆసుపత్రి పాలు కావాల్సిందే. ఇప్పటికే పలువురు ఆసుపత్రి పాలైన సంఘటనలు ఉన్నాయి. ఇదే మార్గంలో నిత్యం అధికారులు ప్రయాణిస్తున్న ఏమాత్రం పట్టించుకోకపోవడం బాధాకరమని గ్రామస్తులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించాలని చోదకులు కోరుతున్నారు.

రోడ్డు మధ్యలో గుంతలు

యువత స్వయం ఉపాధితో ఎదగాలి

ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

మొబైల్ షోరూం ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని యువత స్వయం ఉపాధితో ఎదగాలని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. గురువారం కుప్పం పట్టణంలో డ్రిప్ మొబైల్ షోరూంను ఎమ్మెల్సీ రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం షోరూం యాజమాన్యాన్ని అభినందిస్తూ యువత జీవనోపాధి కోసం ప్రభుత్వ, ప్రైవేటు రంగాలపై ఆధారపడకుండా స్వయం ఉపాధిని ఎన్నుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు.

ల్యాబ్, క్లినిక్స్‌కు రిజిస్ట్రేషన్లు తప్పనిసరి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో గురువారం పిసిపిఎన్ డిటి యాక్ట్ చిత్తూరు డివిజన్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం ఆర్‌డిఓ శ్రీనివాసులు, ఇంచార్జ్ వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో రిజిస్టర్ చేసుకున్న ఆసుపత్రి, లాబ్, క్లినిక్ వాళ్ళు మాత్రమే ప్రాక్టీస్ చేయాలని, రిజిస్టర్ కానివారు వైద్యం చేసినట్లయితే చట్టప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. గర్భిణీ స్త్రీలకు అబార్షన్, గర్భస్థ లింగ నిర్ధారణ చేసినట్లయితే పిసిపిఎన్ డిటి యాక్ట్ ప్రకారం మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.10వేలు జరిమాన విధిచడంతోపాటు సీజ్ చేస్తామని హెచ్చరించారు. మెడికల్ షాప్ పారాసిటిమోల్ మాత్ర తప్ప మిగతా ఏ మెడిసిన్ అయినా ప్రిస్క్రిప్షన్‌తోనే ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ లత, డాక్టర్ శిరీష, డ్రగ్ ఇన్స్పెక్టర్ కీర్తన, ఐసిడిఎస్ పిడి జయంతి, రాజేంద్రప్రసాద్, శేషాద్రి, రమాదేవి, రామారావు, ఎన్జీవోలు పాల్గొన్నారు.

ఆశ్రయం లేని వారిని ఆదుకుందాం

ఘనంగా ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆశ్రయంలేని వారిని ఆదుకొని మానవత్వాన్ని చాటుకోవాలని, నిరాశ్రయులను ఆదరించి వారికి అండగా ఉండాలని లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డ్, ఎంవి కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఫౌండర్ ఎన్‌వి.శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా మెప్మా, నగరపాలక సంస్థ సహకారంతో నగరంలోని సపోర్ట్ సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి నూతన వస్త్రాలను అందజేశారు. అనంతరం సపోర్ట్ సంస్థ అధ్యక్షులు పి.జోసెఫ్ రాజు ఆధ్వర్యంలో నిరాశ్రయులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా 50 మంది నిరాశ్రయులకు శాలువ కప్పి సత్కరించారు. క్లబ్ వారు శ్రీనివాసమూర్తి, ప్రభాకర్, రెడ్డప్ప, జమీర్, రమణ, దేవేంద్ర, పట్టాభిరెడ్డి, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.



యువత రాజకీయాల్లో రాణించాలి

ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: యువత రాజకీయాల్లోకి రావాలని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. గురువారం మండలంలోని వ్యవసాయ మార్కెట్లో నల్లగాంపల్లికి చెందిన పృథ్వి పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అనంతరం కేక్‌కట్ చేసి పంచిపెట్టి, అన్నదానం చేశారు. మండల టిడిపి అధ్యక్షులు జయప్రకాశ్ నాయుడు, సుచిత్ర, జయచంద్ర నాయుడు, హేమచంద్ర నాయుడు, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కోకా ప్రకాష్ నాయుడు, ఎన్నారై విక్రమ్ పాల్గొన్నారు.

ఘనంగా పాల కలశాల ఊరేగింపు

ప్రజాశక్తి- వీ కోట: మండల కేంద్రమైన వీ కోటలో వెలసిన శ్రీదుర్గా మాత ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం నిర్వహించిన పాల కళశాల ఊరేగింపును కన్నుల పండుగలా జరిగింది. పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి సతీమణి రేణుక రెడ్డి పాల్గొన్నారు. వారికి ఆలయ పాలకవర్గ సభ్యులు సాదర స్వాగతం పలికారు. శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం నుండి 3033 పాల కలశాలతో పెద్ద ఎత్తున మహిళలు దుర్గామాత ఆలయం వరకు పట్టణంలో ఊరేగింపుగా తరలివచ్చారు. జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసులు, దుర్గామాత ఆలయ కమిటీ చైర్మన్ దామోదర్ రెడ్డి ఈ ఊరేగింపులో పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం అమ్మవారికి పాలాభిషేకం నిర్వహించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్ర నాయుడు, సర్పంచ్ లక్ష్మమ్మ, రంగనాథ్, రాంబాబు, తుకారం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టవ్యతిరేకం : సిఐ

సమావేశంలో మాట్లాడుతున్న డీన్ డాక్టర్ కృష్ణారావు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: ర్యాగింగ్, లైంగిక వేధింపులకు పాల్పడటం చట్ట వ్యతిరేకమని, విద్యార్థులు ఇలాంటి చర్యలకు దూరంగా ఉండాలని కుప్పం రూరల్ సిఐ మల్లేశ్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పిఇఎస్ వైద్య కళాశాలలో డీన్ డాక్టర్ కృష్ణారావు ఆధ్వర్యంలో ర్యాగింగ్ నివారణ, లైంగిక వేధింపుల నిరోధక కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి రూరల్ సిఐ హాజరై మాట్లాడారు. కళాశాలలో విద్యార్థులు స్నేహభావంతో మెలగాలని, జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఆదర్శంగా ఉండాలని సూచించారు. ర్యాగింగ్, లైంగిక వేధింపులను అరికట్టడానికి పోలీసులు తీసుకోనే చర్యలను వివరించారు. కళాశాల డీన్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి చర్యలకు పాల్పడితే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అన్నదానం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: శ్రీఆరిమాని గంగమ్మ దసరా మహోత్సవంలో భాగంగా శ్రీ లలితా దేవి అలంకరణతో అమ్మవారు గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి అభిషేకానికి శివగంగపురం గ్రామానికి చెందిన చిట్టి నాథముని కుమారుడు వేదజాని, గోపీ కుటుంబ సభ్యులు ఉభయ దారులుగా వ్యవహరించారు. గురువమ్మ, దొరస్వామినాయుడు దంపతుల కుమారులైన ప్రసాద్‌బాబు, ప్రకాష్‌బాబు, ప్రవీణ్ కుమార్ కుటుంబ సభ్యులు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

గజవాహనంపై లక్ష్మీ నారాయణుడు

గంగాధర నెల్లూరు: వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనారాయణ స్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు సందర్భంగా గురువారం హనుమంత, గజవాహనాలపై లక్ష్మీనారాయణస్వామి పురవీధులలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టీ కెఎస్.వాసు, అమృతవల్లి దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తుల అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ మేనేజర్ వెంకటేష్ రెడ్డి, మాజీ ఆలయ ట్రస్టీ సతీమణి సుమిత్ర శ్రీధర్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి ఘనస్వాగతం

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని మామడుగు గ్రామపంచాయతీ కార్యదర్శిగా వేణు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఈసందర్భంగా సచివాలయ సిబ్బంది, ప్రజలకు ఆయన్ను సన్మానించి ఘనంగా స్వాగతం పలికారు. గతంలో ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన హేమలత బదిలీ కావడంతో ఆమె స్థానం వేణు బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది, ప్రజల సహకారంతో పంచాయతీలోని సమస్యలను పరిష్కరిస్తానని వేణు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిని సన్మానిస్తున్న సిబ్బంది

మళ్లీ తెరపైకి... గరుడ వారధి

'గరుడ వారధి పోయి శ్రీనివాస సేతు వచ్చె.. మళ్లీ శ్రీనివాస సేతు పోయి గరుడ వారధి వచ్చె'.. ఇదీ పాలకుల ఆలోచన తీరు.. తిరుపతి స్మార్ట్ సిటీ పథకంలో రూ.648 కోట్లతో నిర్మించిన శ్రీనివాస సేతు పేరును మార్చాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. త్వరలో జరగనున్న కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదన పెట్టి తీర్మానం చేయాలని నిర్ణయించారు. అయితే కార్పొరేషన్ లో వైసీపీ బలం ఉండడంతో మేయర్ డాక్టర్ శిరీష నేతత్వంలో జరిగే కౌన్సిల్ సమావేశంలో శ్రీనివాస సేతు పేరు మార్పును వారు అంగీకరిస్తారా లేదా అన్నది కౌన్సిల్ సమావేశం జరిగే వరకూ వేచి చూడాల్సిందే.

- 'శ్రీనివాస సేతు' మార్పునకు ప్రతిపాదన
- వైసీపీ కార్పొరేటర్లు ఆమోదించేనా..?

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

2019 అసెంబ్లీ ఎన్నికల సమయంలో టిడిపి ప్రభుత్వం గరుడ వారధి పేరుతో తిరుచానూరు మార్కెట్ యార్డ్ నుంచి కపిల తీర్థం వరకు ఏడు కిలోమీటర్ల వరకు నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. ఎన్నికల కోడ్ రాకముందు గరుడ వారధి పనులు జోరుగా సాగాయి. ఆ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గరుడవారధి పేరు మార్చి శ్రీనివాస సేతు పేరును కౌన్సిల్లో తీర్మానం చేసి ఆమోదించారు. అప్పటి నుంచి శ్రీనివాస సేతుగా పిలిచేవారు. దీనికి సంబంధించిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో ఏడాది క్రితం అప్పటి సీఎం జగన్ మోహన్ రెడ్డి శ్రీనివాస సేతును ప్రారంభించారు. ఇప్పుడు టిడిపి కూటమి అధికారంలోకి రావడంతో తమ హయాంలో చేపట్టిన పనులను వైసీపీ ప్రభుత్వం పేరు మార్చి పెట్టడం అప్పట్లో టిడిపి అభ్యంతరం తెలిపిన విషయం తెలిసిందే. త్వరలో జరిగే కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో శ్రీనివాస సేతు పేరును మార్చి గరుడ వారధి పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఫైల్‌ను కార్పొరేషన్ అధికారులు సిద్ధం చేశారు. టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు శ్రీనివాస సేతు పేరు మార్చి గరుడ వారధిగా పెట్టాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఇదిలా ఉండగా తిరుపతి కార్పొరేషన్‌లో వైసీపీ పార్టీకి చెందిన కార్పొరేటర్‌లు అధికంగా ఉన్నారు. జనసేన టిడిపి పార్టీలకు చెందిన కార్పొరేటర్లు తక్కువ మంది ఉన్నారు. ఈనెల నెల నాలుగో తేదీ జరగాల్సిన స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికల ప్రక్రియ కూటమి పార్టీకి చెందిన కార్పొరేటర్లు తక్కువ మంది ఉండడంతో వాయిదా పడిన విషయం తెలిసిందే. 2020 కార్పొరేషన్ ఎన్నికల్లో 50 డివిజన్లకు గాను 49 డివిజన్లకు ఎన్నికలు జరిగాయి. అందులో 35వ డివిజన్ టిడిపి కార్పొరేటర్ ఆర్ సి ముని కష్ణ ఒకరే గెలిచారు మిగిలిన వారందరూ వైసిపి కార్పొరేటర్ గా గెలిచారు. మేయర్ తో పాటు ఇద్దరు డిప్యూటీ మేయర్లు వైసిపి వారే ఉన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ఆ ఎన్నికల సమయంలోనే టిడిపి జనసేన నుంచి కొంత మంది కార్పొరేటర్లు చేరిపోయారు. టిడిపి జనసేన సంబంధించి 12 మంది మాత్రమే కార్పొరేటర్లు ఉన్నారు. మిగిలిన వారంతా వైసిపి కార్పొరేటర్లుగానే ఇప్పటికీ కొనసాగుతున్నారు.

ఒకవేళ కౌన్సిల్లో మెజార్టీ సభ్యులు శ్రీనివాస సేతు పేరును కొనసాగించాలని డిమాండ్ చేసినా గరుడ వారధి పేరును మార్చడం ఖాయమైనట్టు తెలుస్తోంది.

తక్కువ ధరకు వంటనూనె

ప్రజాశక్తి - రామకుప్పం

మండలం ప్రజానీకానికి దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకొని గోల్డ్ విన్నర్ వంట నూనెను రాష్ట్ర సివిల్ సప్లయర్స్ సంస్థ ద్వారా తక్కువ ధరకు అందించనున్నట్లు గురువారం తహసీల్దార్ బాబు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రామకుప్పంలోని ఎస్ఎల్ఎం ట్రేడర్స్‌లో ఒక లీటర్ ప్యాకెట్ రూ.129లకు అందివ్వడం జరుగుతుందన్నారు. బయట మార్కెట్ కంటే ధర తక్కువగా ఉండటంతో మండల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పలమనేరు: పలమనేరు బజారు వీధిలో రాష్ట్ర ప్రభుత్వం పౌరసఫరాలశాఖ ఆధ్వర్యంలో పలమనేరు ఆర్‌డిఓ కె.శ్రీనివాసులు రాజు, తహశీల్దార్, డిఎస్‌ఓలు రూ.129లకే వంటనూనె విక్రయించే కౌంటర్‌ను గురువారం ప్రారంభించారు.

దుర్గాదేవిగా అల్లి ఎల్లమ్మ తల్లి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో కొలువైన శ్రీఅల్లి ఎల్లమ్మతల్లి దేవస్థానంలో దసరా మహోత్సవాలలో భాగంగ గురువారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. దాదాపు 500 మందికి మురళి బాబు, విజయ బాబు, అశ్విత్ జశ్విత్, కుటుంబ సభ్యులు ఉభయ దారులుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఆలయ మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు పార్థసారధి రెడ్డి, నిర్వాహకులు గుణశేఖర్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్ పాల్గొన్నారు.

దుర్గాదేవిగా బోయకొండ గంగమ్మ

బంగారుపాళ్యం: మండలంలోని బొమ్మయపల్లి పంచాయతీ వజ్రాలపురం బోయకొండ గంగమ్మ, మండల కేంద్రంలోని ముత్యాలమ్మ దసరా ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు గురువారం దుర్గాదేవిగా అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

పలమనేరు: పాతపేటలోని శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ప్రత్యేక పూజలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

కొండంతా...ఆధ్యాత్మిక శోభ

ప్రజాశక్తి - తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ విద్యుత్ శాఖ తిరుమలలో ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణతో తిరుమల కొండ వైకుంఠాన్ని తలపిస్తోందని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తిరుమల శోభ చూడానికి రెండు కళ్లు చాలడం లేదని, వైకుంఠం భువికి దిగివచ్చిందా అన్న చందంగా విద్యుత్ కాంతులతో తిరుమల కొండ భక్తులు రాత్రుల్లో కొండ అందాలను కనులారా వీక్షిస్తున్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా వాహన సేవలను వీక్షించేందుకు వచ్చిన లక్షలాదిమంది భక్తులను ఆకట్టుకునేందుకు శ్రీవారి ఆలయాన్ని ప్రత్యేకమైన పార్కన్, ఫకాడ్ లైటింగ్‌తో టీటీడీ అలంకరించింది. రంగురంగుల కాంతులతో శ్రీవారి ఆలయ గోడలను, మహాద్వార గోపురం, మాడ వీధులు, ముఖ్యమైన కూడళ్లు, ఆర్చిల వద్ద భక్తులు మైమరచేలా విద్యుత్ వెలుగులను శోభాయమానంగా అలంకరించారు. తిరుమలలోని ఇతర ఆలయాలు, గార్డెన్లు, చెట్లను ప్రత్యేక విద్యుత్ కాంతులతో సినిమా సెట్టింగ్ లను తలపించేలా అలంకరించారు. పురాణాలు, ఇతిహాసాల్లోని దేవతల రూపాలతో తిరుమల కొండ మొత్తం విద్యుత్ బోర్డులు ఏర్పాటు చేయడంతో భక్తి పారవశ్యంతో భక్తులు ఆధ్యాత్మిక వాతావరణంలో ఆహ్లాదంగా విహరిస్తున్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలను కలియుగ వైకుంఠంగా అనుభూతి కలిగించేలా విద్యుత్ అలంకరణలకు టీటీడీ రూ.2.20కోట్లు మంజూరు చేసింది. శ్రీవారి ఆలయ ప్రాంగణం, కళ్యాణ వేదిక, కూడళ్ల వద్ద టీటీడీ 14 భారీ ఎలక్ట్రికల్ బోర్డులు, 30 చిన్న ఎలక్ట్రికల్ బోర్డులను ఏర్పాటు చేసింది. లక్ష్మీ వేంకటేశ్వర, సీతా రాములు, శ్రీరామ పట్టాభిషేకం, మహా విష్ణు, విశ్వరూపం, దశావతార రూపాలను భారీ ఎలక్ట్రికల్ బోర్డులతో ఏర్పాటు చేశారు. అష్ట లక్ష్ములు, తుంబూరుడు, అన్నమాచార్యుడి వంటి ఇతర రూపాలతో మరో 30 ఎలక్ట్రికల్ బోర్డులను ఏర్పాటు చేశారు. భక్తులకు విస్మయం కలిగేలా విద్యుత్ కాంతుల అలంకరణకు 100 మందికి పైగా టీటీడీ విద్యుత్ శాఖ సిబ్బంది నెల రోజులకు పైగా తీవ్రంగా శ్రమించారు.

విద్యుత్ అలంకరణలపై టీటీడీ ఈఓ జె.శ్యామలరావు మాట్లాడుతూ శ్రీవారిని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించే భక్తులను బ్రహ్మోత్సవాల్లో ఆకట్టుకునేలా ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా విద్యుత్ అలంకరణలను



ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని తెలియజేశారు. భక్తులు వాహన సేవలను తిలకించేందుకు తిరుమలలోని శ్రీవారి ఆలయ మాడ వీధులు, మ్యూజియం, వరాహస్వామి రెస్ట్ హౌస్, అన్నదానం కాంప్లెక్స్, రాంభగీచా, ఫిల్టర్ హౌస్, ఇతర ప్రాంతాల్లో 32 భారీ డిజిటల్ స్క్రీన్లను టీటీడీ ఏర్పాటు చేసింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలకు విచ్చేసిన భక్తులను ఆకట్టుకునేలా జీఎన్సీ ఏరియాతో పాటు పలు పార్కుల్లో దేవతా రూపాలతో ప్రత్యేక ఎలక్ట్రికల్ కటౌట్ లు ఏర్పాటు చేశారు. తిరుమలలోనే కాకుండా తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం, బస్టాండ్, రైల్వే స్టేషన్ స్వాగత తోరణాల వద్ద ప్రత్యేకమైన విద్యుత్ అలంకరణలను టీటీడీ ఏర్పాటు చేసింది.

చక్రస్నానం ఏర్పాట్లపై టీటీడీ ఈఓ తనిఖీలు

తిరుమల : శనివారం నిర్వహించనున్న చక్రస్నానం ఏర్పాట్లపై టీటీడీ ఈఓ జె.శ్యామల రావు అధికారులతో కలసి గురువారం శ్రీవారి పుష్కరిణీ వద్ద తనిఖీలు నిర్వహించారు. ప్రవేశ మార్గాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అడిషనల్ ఈఓ సీహెచ్.వెంకయ్య చౌదరి, జేఈఓలు వీరబ్రహ్మం, గౌతమి, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ సీవీఎస్వో శ్రీధర్ పాల్గొన్నారు.

మారుతి నగర్ లేఅవుట్ అంతా బోగస్..

అంబులెన్స్‌ను ప్రారంభించిన కలెక్టర్

అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే భాను

ప్రజాశక్తి- విజయపురం

నగిరి రూరల్ పరిధి గుండ్రాజు కుప్పం పంచాయతీకి చెందిన మారుతీ నగర్ లేఅవుట్‌లో నిర్మిస్తున్న ఇళ్లకు ఎలాంటి పట్టాలు లేవని అవన్నీ బోగస్ అని ఆ గ్రామానికి చెందిన ఉమాపతి రాజు, ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం నగరి ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో నిర్వహించిన ప్రజావేదికలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, నగిరి ఎమ్మెల్యే భాను ప్రకాష్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి పాల్గొన్నారు. నగరి రూరల్, నింద్ర, విజయపురం మండలాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 228 అర్జీలు రాగా వాటన్నిటిని అధికారులు పరిశీలించారు. గుండ్రాజు కుప్పం పంచాయతీకి చెందిన మారుతి నగర్‌లో కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని, ఏ ఒక్క ఇంటికి పట్టాలు లేవని ఫిర్యాదు చేశారు. ఆ మారుతి నగర్‌లే అవుట్‌ను రద్దు చేసి వాటిని పేదలకు ఇంటి పట్టాలుగా ఇప్పించాలని కోరారు. అలాగే గుండ్రాజు కుప్పంలో సుమారు మూడు ప్రైవేట్ సెల్‌టవర్లు ఉన్నాయని ఆ రేడియేషన్ ద్వారా గ్రామ ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఫిర్యాదు చేశారు. గ్రామం తీర్మానం లేకుండా అనధికారకంగా ఏర్పాటు చేసిన సెల్ టవర్ ను వెంటనే గ్రామం నుంచి తొలగించాలని కలెక్టర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. విజయపురం మండలానికి చెందిన కొందరు గ్రామీణ ప్రాంతాలలో మురుగునీటి కాలువలు లేవని వెంటనే ఏర్పాటు చేయాలని, పట్టా పాస్ పుస్తకాల్లో ఉన్న నెంబర్లు వన్ బిలో కనబడడం లేదని దీనిపై రెవెన్యూ అధికారులకు ఎన్ని అర్జీలు ఇచ్చినా సమస్యను పరిష్కరించలేదని ఫిర్యాదు చేశారు. అలాగే మూడు మండలాలలో అర్హత ఉన్న ఇంతవరకు ఇంటి స్థలం, ఇళ్ల మంజూరు చేయలేదని సుమారు 50 మంది ఫిర్యాదు చేశారు. వికలాంగులకు ట్రైన్స్ సైకిల్ ఇవ్వాలని, తమ గ్రామంలో తాగునీటి వసతి లేదని, మురికి కాలువలో పూడికతిత పనులు చేపట్టలేదని, పారిశుధ్యం అధ్వానంగా ఉందని ప్రజలు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ప్రజాప్రభుత్వం అని గత ప్రభుత్వ లాగా ప్రజలను మోసం చేయదని అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే భానుప్రకాష్

అంబులెన్స్‌ను ప్రారంభించిన కలెక్టర్

నగిరి ఏరియా హాస్పిటల్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే భాను అంబులెన్స్ వాహనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మెరుగైన వైద్యం కోసం తిరుపతి వెళ్లాలంటే సరైన అంబులెన్స్ లేకపోవడంతో చాలామంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, ఇకపై అటువంటి సమస్య ఉండదని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పి సీఈవో రవి కుమార్ నాయుడు, హౌసింగ్ పిడి పద్మనాభం, ఏడీ సర్వే గౌస్ బాష, ఇన్‌చార్జి హెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్, డిఎల్‌డిఓ రవి కుమార్, నగరి ఆర్‌డిఓ వెంకట రమణ, తహశీల్దార్ రవి, ఎంపిడిఓ సతీష్ పాల్గొన్నారు.

ట్రై సైకిల్ కోసం వచ్చా...

-ఈశ్వర్, చింతలపట్టాడా నగరి

నాకు పుట్టుకతోనే అంగవైకల్యం. కర్ర సహాయంతో నడుస్తున్నాను, ఇది చాలా ఇబ్బందికరంగా ఉంది. ట్రై సైకిల్ కోసం గతంలో చాలాసార్లు అర్జీలు ఇచ్చాను కానీ ఇంతవరకు ఎవ్వరు ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం అయినా కరుణించి ట్రై సైకిల్ ఇవ్వాలని కలెక్టర్‌కి అర్జీ ఇచ్చాను. అర్జీ తీసుకున్న కలెక్టర్ సహాయం చేస్తామని హామీ ఇచ్చారు.

పదేళ్లుగా అద్దె భవనంలోనే..

- చెల్లమ్మ, రామ్‌నగర్, నగరి.

నేను నగిరి పట్టణం రామ్‌నగర్‌లో పదేళ్లుగా అద్దె భవనంలో ఉన్నాను. నాకు సొంతంగా ఇళ్లు లేదు, కనీసం ఇంటి జాగా కూడా లేదు. 100 సార్లు అర్జీలు ఇచ్చుకున్నాను. ఎవరు పట్టించుకోలేదు. ఈ సమావేశంలో అర్జీ ఇస్తే ఇంటి స్థలంతో పాటు ఇల్లు కూడా మంజూరు చేస్తారని చెప్పారు అందుకే వచ్చాను.

కాలువ ఏర్పాటు చేయాలి

- లక్ష్మయ్య పొన్నూరు, ఆదిఆంధ్రవాడ, విజయపురం

మాది విజయపురం మండలం పొన్నూరు ఆదిఆంధ్రవాడ. మా గ్రామంలో మురికి కాలువ లేవు, వర్షం పడినప్పుడు వర్షపునీరు ఇళ్లల్లోకి వస్తుంది. ఇటీవల దీనిపై అధికారులకు చెప్పాను పట్టించుకోలేదు. ఈ వేదికలో అర్జీ ఇచ్చుకుంటే మురికి కాలువ ఏర్పాటు చేస్తామని తెలిసింది అందుకోసమే కలెక్టర్‌ని కలిసి అర్జీ ఇచ్చాను.

రేపు 'జీ తెలుగు కుటుంబం' అవార్డ్స్ ప్రదానోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఈ నెల 12వ తేదీన దసరా సందర్భంగా జీ తెలుగు కుటుంబ అవార్డు ప్రదానోత్సవం జరుగుతుందని ఉమ్మడి చిత్తూరు జిల్లా జీ నెట్వర్క్ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. జీ తెలుగు తారలు, టాలీవుడ్ ప్రముఖులతో సందడిగా సాగిన జీ తెలుగు కుటుంబం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమ మొదటి భాగం అక్టోబర్ 12 సాయంత్రం 6 గంటలకు మీ జీ తెలుగులో.. తప్పక చూడాలన్నారు.ఈ కార్యక్రమానికి ఎనర్జిటిక్ జోడీ రవి- లాస్య వ్యాఖ్యాతలుగా వ్యవహరించారని తెలిపారు.

క్రైం న్యూస్

అక్రమ ఇసుక తరలిస్తున్న జెసిబి సీజ్

రూ.లక్ష జరిమానా

ప్రజాశక్తి- పలమనేరు

పలమనేరు మండలం కౌండిన్య నదీ పరివాహక ప్రాంతం పలుచోట్ల రైతుల ఫిర్యాదు మేరకు ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకునే నేపథ్యంలో ట్రెంచ్‌లు కొట్టడం జరిగింది. అయినా కొంతమంది వ్యక్తులు ట్రెంచ్‌లను పూడ్చివేసి మళ్లీ ఇసుక తరలింపు చేస్తున్నారని సమాచారంతో గురువారం తహశీల్దార్ ఇన్‌బనాథన్ దాడులు నిర్వహించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న జెసిబి, ఇతర వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేయడంతోపాటు ఇసుక తరలిస్తున్న వారికి రూ.లక్ష జరిమానా విధించినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలను తీసుకుంటామన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో పోలీస్, రెవెన్యూ సంయుక్తంగా నిఘా పెట్టి ఉన్నామన్నారు. ముఖ్యంగా బ్రిడ్జ్, కల్వర్టరు ఉన్నచోట చుట్టుపక్కల 500 మీటర్లు లోబడి ఎక్కడైనా ఇసుక తవ్వకాలు జరిపితే వాహనాలు సీజ్ చేయడంతోపాటు రూ.లక్ష జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- పుంగనూరు: మనస్థాపానికి గురైన యువతి పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా గుర్తించిన కుటుంబీకులు హుటాహుటిన పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన వివరాలు ఇలా.... పెద్దపంజాణి మండలం పెద్ద వెలగటూరు గ్రామానికి చెందిన నాగమణి కుమార్తె శ్రీబిందు (20) మనస్థాపానికి గురై బుధవారం రాత్రి పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన పుంగనూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స నిర్వహించి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లికి తరలించారు.

పట్ట పగలే చోరీ

60 గ్రాములు బంగారం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని పాలమాకులపల్లి గ్రామానికి చెందిన చిన్నప్ప, అతని భార్య ప్రమీల ఆవులు మేపేందుకు గురువారం పొలం వద్దకు వెళ్లారు. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి ఇంట్లో ఉన్న 60 గ్రాములు బంగారు చోరీ చేసి పరారయ్యారు. గుర్తించి బాధితులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాజీ ఎంపిటిసి మృతి

ప్రజాశక్తి - రామకుప్పం: మండల పరిధిలోని కొంగనపల్లి సెగ్మెంట్ మాజీ ఎంపిటిసి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కెసి.వెంకటేష్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతిచెందాడు. ఆయన మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

నెంబర్ ప్లేట్ లేకుంటే కఠిన చర్యలు

ప్రజాశక్తి- శాంతిపురం: మండలం కర్ణాటక -తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్నందువలన కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు పగలు, రాత్రి సమయాలలో నెంబర్ ప్లేట్ లేని వాహనాలను తీసుకుని వచ్చి దొంగతనాలు చేయుటకు ప్రయత్నిస్తున్నారని ఎస్ఐ నరేష్ తెలిపారు. పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు 11వతేదీ నుండి శాంతిపురం మండలంలో నెంబర్ ప్లేట్ లేని వాహనాలు నడుపుతున్న వారిపైన ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, సదరు వాహనాలను సీజ్ చేయనున్నట్లు తెలిపారు. కనుక మండల ప్రజలందరూ మీకు చెందిన వాహనాల రికార్డులు సక్రమంగా ఉంచుకొని, హెల్మెట్ ధరించి, నెంబర్ ప్లేట్లు అమర్చుకొని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరారు.

త్వరలో తుడాకు శెట్టిపల్లి భూములు

ప్రత్యేక జీవో ద్వారా పరిష్కారం :కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శెట్టిపల్లి భూములను త్వరలో తిరుపతి పట్టణాభివద్ధి సంస్థ (తుడా) కు బదిలీ చేసి శాశ్వత పరిష్కారం చూపేలా ప్రత్యేక జీవో ప్రభుత్వం నుండి వెలువడుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ శెట్టిపల్లి భూ బాధితులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, తుడా, ఆర్డీవో, రెవెన్యూ అధికారులతో కలిసి శెట్టిపల్లి భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ శెట్టిపల్లి భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి రెవెన్యూ,ల్యాండ్ అండ్ సర్వే, మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల సమన్వయం చేసుకొని భూ సర్వే పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. శెట్టిపల్లి భూ బాధితుల కమిటీ అధ్యక్షులు రాధాకష్ణ, కార్యదర్శి శ్రీను మాట్లాడుతూ దశాబ్దాలుగా శెట్టి పల్లె భూ సమస్య పరిష్కారానికి నోచుకోలేదని, అధికారులు మారిన ప్రతిసారి శెట్టిపల్లె భూ సమస్యను తామే వివరించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్ శెట్టిపల్లె భూ సమస్యపై ఇప్పటికే సీఎం నారా చంద్రబాబు నాయుడు దష్టికి తీసుకెళ్లానని, భూ సర్వే తదితర అంశాలు పూర్తికాగానే రోజుల వ్యవధిలో శెట్టిపల్లె భూములను ప్రత్యేక జీవో ద్వారా తుడాకు అప్పజెప్పి శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. రైతులకు 30 శాతం, ఫ్లాట్లకు కొనుగోలుదారులకు 50శాతం, రెండు సెంట్లు భూమి తగ్గకుండా భూ సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. స్థానిక ప్రజలు శెట్టిపల్లి భూములలో మట్టిని తోలుకొని భూములను అస్తవ్యస్తంగా తయారు చేశారని కలెక్టర్ దష్టికి తీసుకురావడంతో స్పందించిన కలెక్టర్ మట్టి తీసుకెళ్లే వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తుడా ఎస్ఈ కష్ణారెడ్డి, ల్యాండ్ ఆక్విజిషన్ అధికారిణి సుజన, ఈఈ రవీంద్రయ్య, టిపిఓ దేవికుమారి, ఆర్డిఓ, డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్, అర్బన్ తహశీల్దార్ భాగ్యలక్ష్మి, డిటిలు అశోక్, కిరణ్, ఆర్ఐ జానీ భాష, విఆర్‌ఓలు, శెట్టిపల్లి భూ బాధితుల కమిటీ సభ్యులు రాజేంద్ర, ఆవుల సురేష్ యాదవ్, కష్ణ, షణ్ముగం, గోడ్ల నాదముని, మురుగేష్, నజీర్ బాష పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRL.JUNIOR CIVIL JUDGE OF CHITTOOR

O.S.No. 305 of 2017

Between:
P.Srinivaulu Naidu and 2 others
.. Plaintiffs
And:
Smt Koduru Bhagyavathi and others
Defendants

NOTICE TO DEFENDANT NO.6

To
Thejovathi@Kalpana,
D/o Chinnabba Naidu,
Residing at D.No.11-132,2nd Floor,
Sundarayyar Street,
Chittoor Town and District
Sir/ Madam,

Please take notice that the above case is posted to **21-10-2024** for your notice and appearance at 10-30 a.m before the above said court. You may appear either in person or through an advocate and file your objections if any, failing which the matter will be decided ex-parte.

D.K.RAGHURAM
Advocate for Plaintiffs
Place: Chitoor, Date: 09.10.2024